క్లుప్తంగా

వధూవరులకు ఎంపీ ఆశీర్వాదం



కలికిరిలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు

కలికిరి: పుంగనూరు నియోజకవర్గం కల్లూరుకు చెందిన పెద్దిరెడ్డి కుటుంబ ముఖ్య అనుచరుడు పురుషోత్తం రెడ్డి కుమారుడు సాయిభరద్వాజ రెడ్డి, కలికిరి పట్టణానికి చెందిన మధురెడ్డి కుమార్తె గాయత్రిప్రియ వివాహ నిశ్చితార్థ వేడుక కలికిరి టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీం, ఉదయ్‌కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు వారి వెంట పాల్గొన్నారు.

రూటా రాష్ట్ర కన్వీనర్ల నియామకం



ఇస్మాయిల్



సలీంఖాన్

మదనపల్లె సిటీ: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) అకడమిక్ విభాగం కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందదిన ఉర్దూ ఉపాధ్యాయులు ఏ.ఇస్మాయిల్,సోషియల్ మీడియా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా సలీంఖాన్‌లను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర నాయకులు అయూబ్ తెలిపారు. రాష్ట్ర కన్వీనర్లు ఇస్మాయిల్ ,సలీంఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూటా సంఘ బలోపేతానికి, ఉర్దూ పాఠశాలల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. తమకు రాష్ట్ర కన్వీనర్లుగా నియమించినందుకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్, రాష్ట్ర కో ఆర్డినేటర్ మహమ్మద్‌ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అమిత్‌షా పర్యటనపై సీపీఐ నిరసన

బి.కొత్తకోట: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం సీపీఐ కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమిత్‌షా గో బ్యాక్, మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవహేళన చేశారన్నారు. దీన్ని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మోడి, అమిత్‌షాలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, మనువాద రాజ్యాంగాన్ని పార్లమెంటులో ప్రవేశ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తంబయ్యశెట్టి, గంగులప్ప, నారాయణస్వామి, రమణ, షఫీ, హబీబ్, బావాజాన్, బాషా పాల్గొన్నారు.

గంపనపల్లెలో పశువుల పండగ

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ గంపనపల్లె గ్రామంలో ఆదివారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటి ముందు గొబ్బెమ్మలు పెట్టి రంగు రంగుల ముగ్గులు వేశారు. పశువులను శుభ్రంగా కడిగి కొమ్ములను ముస్తాబు చేసి రంగులు వేసి, రంగులబెలూన్‌లు కట్టి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కాటమరాజుల ఆలయం చుట్టూ పశువులన ప్రదక్షిణ చేయించి చిట్లా కంపను చూపించారు. గ్రామంలో బంధుమిత్రులు సందడి తో కలకళలాడింది. రెడ్డివీరే గౌడ్, బసవరాజ్, రామన్న, వెంకట రెడ్డి, చంద్రప్ప, విశ్వనాధ్, శాంత కుమార్, నాగరాజు, లోకేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆ నలుగురు ఉత్తములు



అవార్డులతో మహిళా ఉపాధ్యాయులు

బి.కొత్తకోట: ఎన్నడూ లేని విధంగా నలుగురు మహిళా ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డులు 2025కి ఆదివారం గుంటూరులో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో స్థానిక విద్యార్థి కాన్సెప్ట్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు పి.తస్లీమాబీ, అనూరాధ, భారత్ హైస్కూల్‌కు చెందిన విజయ, భారతీలను అవార్డులకు ఎంపిక కావడంతో వారిని ఎమ్మెల్సీ లక్ష్మణరావు సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. బి.కొత్తకోట నుంచి నలుగురు ఉపాధ్యాయులకు అవార్డులు దక్కడంపై పాఠశాల డైరెక్టర్లు పూజారి శ్రీనివాసులు, ఉమారమణ, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

నిధులున్నా..అభివృద్ధి శూన్యం

- హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీలో పుష్కలంగా నిధులు
- పారిశుద్ధ్యం, తాగునీటికి చర్యలు లేవు
- హైమాస్ లైట్లు వెలగడం లేదు
- సౌకర్యాల కల్పనకు నిధులు వినియోగించాలి



మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్



గాలిబండపై హైమాస్ లైట్ స్విచ్ బోర్డు దుస్థితి

బి.కొత్తకోట: జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్. 2000లో అప్పటి ప్రభుత్వం బి.కొత్తకోట మండలం కోటావూరు గ్రామపంచాయతీ, మండల పరిషత్ పరిధి నుంచి తొలగిస్తూ టౌన్‌షిప్ కమిటీని నియమించింది. అప్పటి నుంచే అసలు సమస్యలు మొదలయ్యాయి. హార్సిలీహిల్స్‌పైకి వెళ్లి సరదాగా తిరిగొద్దామనుకునే సందర్శకుల జేబులకు చిల్లు పడుతుందేకాని వారికి కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు హార్సిలీహిల్స్‌పై అధికారులు తీసుకున్న చర్యలు సందర్శకులను సౌకర్యాలు కల్పించాయి. గత ఏడు నెలలుగా కొండపై ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో కనీసం పట్టించుకోవడం లేదు. దీన్నిబట్టి సమస్యలు ఎలా పీడిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నాలుగేళ్లలో రూ.1.11 కోట్ల ఆదాయం

హార్సిలీహిల్స్‌పైకి వచ్చే వారినుంచి టోల్ పేరుతో అధికారులు రుసుము వసూలు చేయిస్తున్నారు. 2020కి ముందు బైక్‌కు రూ.10, కారుకు రూ.20 వసూలు చేసేవారు. తర్వాత దీన్ని పెంచగా ప్రస్తుతం అత్యధికంగా బైక్‌కు రూ.50, కారుకు రూ.100, ఆటోకు రూ.70, బస్సుకు రూ.200 వసూలు చేస్తున్నారు. ఈ టోల్ వసూలుకు వేలంపాటలు నిర్వహించి ప్రయివేటుకు అప్పగించారు. 2020–22 వరకు టోల్‌ఫీజు రూ.12.10 లక్షలు పలికింది. 2022 సెప్టెంబర్ నుంచి అగష్టు 2023 వరకు రూ.26.35 లక్షలు, 2023 సెప్టెంబర్ నుంచి 2024 అగష్టు వరకు రూ.27.35 లక్షలు పలకగా ప్రస్తుత ఏడాదికి అత్యధికంగా రూ.45.20 లక్షలు పలికింది. ఈ నాలుగేళ్లలో వచ్చిన ఆదాయం రూ.1.11 కోట్లు. ఇదికాక వేలంపాటలకు ముందు 15ఏళ్లుగా వసూలు చేసిన టోల్ డబ్బు కూడా ఉంది. అయితే ఇది ఎంతుందో అధికారులకు తప్ప ఎవరికి తెలియదు. అంటే టౌన్‌షిప్ కమిటీలో నిధులు పుష్కలంగా ఉన్నట్టు లెక్క.

లైట్లు వెలగడం లేదు

నిధులు పుష్కలంగా ఉండటంతో గత ప్రభుత్వంలో అధికారులు ఐదుచోట్ల హైమాస్ లైట్లను ఏర్పాటు చేయించారు. దీనికోసం టెండర్ల నిర్వహించి రూ.15 లక్షలు ఖర్చుచేసి హైమాస్ లైట్లను నిర్మించడంతో రాత్రివేళల్లో సందర్శకులకు సౌకర్యంగా ఉండటంతోపాటు వెలుగులతో కిలోమీటర్ల దూరంలోని వాళ్లకు అది హార్సిలీహిల్స్ అని తెలిసేది. ప్రస్తుతం ఇవి వెలగడం లేదు. మంచుతో ఇబ్బందులు పడుతున్నా, చీకటి అలుముకున్నా ఇవి వెలగవు. వెలిగినా ఒకటి లేక రెండు మాత్రమే వెలుగుతున్నాయి. దీనితో పర్యాటకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నా పట్టించుకోవడం లేదు.

మినరల్ ప్లాంట్లు మూత

హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్విమ్మింగ్‌పూల్, ఏనుగుమల్లమ్మ ఆలయం వద్ద రెండుచోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటిని గత కలెక్టర్ గిరీషా ప్రారంభించారు. తాగునీటిని కొనుగోలు చేసే అవకాశం లేకుండా ఏర్పాటు చేస్తే ఏడునెలలుగా ఇవి మూత పడ్డాయి. సందర్శకులకు తాగునీటిని అందివ్వలేని పరిస్థితి నెలకొంది. పర్యాటకులు నీటి బాటిళ్లను కొనుగోలు చేయాల్సి వస్తోంది. పారిశుద్ధ్యం కూడా ఇలాగే ఉంది. అప్పుడప్పుడు బి.కొత్తకోట నగర పంచాయతీ కార్మికులను పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు తప్ప..దీనిపై దృష్టి పెట్టడం లేదు. నిధులు అందుబాటులో ఉన్నందున అధికారులు హైమాస్ లైట్లు వెలిగేలా, పారిశుద్ధ్య పనులు నిత్యం జరిపించేలా, తాగునీటి ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఐటీయూసీ కార్యవర్గ ఎన్నిక

బి.కొత్తకోట: ఏఐటీయూసీ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సలీంబాషా, గౌరవ అధ్యక్షుడిగా మౌలా, ఉపాధ్యక్షులుగా అలివేలమ్మ, విమల, గఫూర్, సుందర్‌రాజు, రామాంజులు, సహాయ కార్యదర్శులుగా లోకేష్, బాలకృష్ణ, బాబు, మహబూబ్ బాషా, కోశాధికారులుగా ఆది, గౌస్‌పీర్, కార్యవర్గ సభ్యులుగా నారాయణ స్వామి,మొహమ్మద్, కుమార్, జాఫర్ బాషా, శంకర్, బాషా, నాగరాజు, జయలక్ష్మి, కృష్ణమూర్తి, పాపన్న, మంజులక్ష్మి దేవమ్మ, హసీనా, లక్ష్మన్న, రామలక్ష్మమ్మ, మనోహర్‌లను ఎన్నుకున్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేమన పద్యాలు సమాజాభివృద్ధికి సోపానాలు



పీలేరు: వేమన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు : వేమన పద్యాలు సమాజ అభివృద్ధికి సోపానాలు అని తెలుగు కవి జలకనూరి మురళీధర్ రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వాసి అయిన వేమన తన పద్యాలతో సమాజానికి నీతిని అందించారని తెలిపారు. వేమన పద్యాలతో విద్యార్థి దశ నుంచి మానవ మనుగడకు దోహదం చేస్తాయన్నారు. పామరుల సైతం అర్థమయ్యేలా చిన్న చిన్న ఆట వెలది చందస్సుతో చక్కని నీతివంతమైన పద్యాలు రాసి సమాజ అభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు నాగరాజ, మాధవి, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వెంకటరమణ, భాస్కర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గంగయ్య, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనో వైజ్ఞానికుడు యోగి వేమన

మదనపల్లె : సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సంఘసంస్కర్త, విప్లవకారుడు, అలతిపదాలతో సమాజంలోని రుగ్మతలను తూర్పారబట్టిన మనో వైజ్ఞానికుడు యోగివేమన అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ కొనియాడారు. ఆదివారం స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకేపార్టీ, భారతీయ అంబేద్కర్ సేన సంయుక్తంగా యోగివేమన జయంతి వేడుకలు నిర్వహించాయి. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ...వేమన పద్యాలలో లోకనీతులు, సామాజికరీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయని, కుటుంబవ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరుతో జరుగుతున్న అరాచకాలు, దోపిడీలు, విగ్రహారాధనలోని మౌఢ్యం, కుహనాగురువులు, దొంగసన్యాసులు...ఇలా కనిపించిన ప్రతి సామాజిక రుగ్మతపై వేమన తన కలం ఝళిపించారన్నారు. సమసమాజ నిర్మాణానికి ఎంతో ఉపయుక్తంగా ఉండే వేమన సందేశాన్ని ప్రబలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాలకప్రభుత్వాలు ప్రత్యేకంగా కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పోతబోలురెడ్డెప్ప, మెండెంశ్రీనివాసులు, చాట్లబయన్న, పెద్దపాలెం రవిశంకర్, తలారికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కార్యకర్తలతో కలసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: ప్రజల విశ్వాశాన్ని కూటమి ప్రభుత్వం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రంకొండలోని నక్కామధు కాల్యాణ మండపంలో వాల్మీకిపురం మండలం పునుగుపల్లెకు చెందినమైనార్టీ నాయకులు షామీర్‌బాషా కుమారుడి వివాహానికి హాజరై వధూవరూలను ఆశీర్వదించారు. మండలంలోని రామాపురం పంచాయతీ వంకాయల వారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా రమణయ్య కుమారుడి వివాహ మహోత్సవ విందుకు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి పార్టీలపై విశ్వాసం ఉంచి ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు అందక పోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు గాలిలో కలిసిపోయాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అమ్మఒడి, రైతుభరోసా వంటి పథకాలకు ఈ ప్రభుత్వం ఈ ఏడాదికి మంగళం పాడిందన్నారు. ఎన్నో ఆశలతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన రైతులకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత పంటలబీమా అందించామన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంటలబీమా ప్రీమియం మొత్తాన్ని రైతుల నెత్తినే వేయడం దారుణమన్నారు. దీంతో రైతులపై మోయలేని భారంపడుతోందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గాల్లో కలిసిపోయాయన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉత్తుత్తి పథకమే అని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్లు నక్కాచంద్రశేఖర్, శ్రీధర్‌రాయల్, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, వాల్మీకిపురం మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, మాజీ వైస్‌ఎంపీపీ రెడ్డి నరసింహారెడ్డి, ఎంపీటీసీ యాకూబ్, మాజీ సర్పంచ్ ఆకులరెడ్డెప్ప, నాయకులు రాజారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

బీఎస్పీ అధ్యక్షుడిగా సిద్దయ్య



బి.కొత్తకోట: మండల బీఎస్పీ అధ్యక్షుడిగా జి.సిద్దయ్యను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బాలాజీ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో విస్తరింపజేసి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీ సిద్ధాతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున, సోమశేఖర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ములకలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు: స్థానిక ములకలచెరువు జెడ్పీహైస్కూల్‌లో 1986 – 87 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. కార్యక్రమంలో అప్పటి గురువులతో పాటు అప్పటి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటగా అప్పటి విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువులు వరదాచార్యులు, మునాఫ్‌లను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులు అల్లాబక్షు, రాజు, శేషారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



కందుకూరు జెడ్పీహైస్కూల్‌లో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1995– 96 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా కొంత నగదును ఆర్థిక సహాయం అందించారు. పాఠశాల అభివృద్ధికి కూడా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ శివన్న మాట్లాడుతూ... పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

మున్సిపల్ కార్మికుల హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు
- సీఐటీయూలో చేరిన 50 మంది మున్సిపల్ కార్మికులు



సీఐటీయూలో చేరిన మున్సిపల్ కార్మికులతో సీపీఎం నాయకులు

మదనపల్లె : మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టౌన్ హాల్‌లో మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా హామీలు, జీవోలు రాతపూర్వకంగా ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని 7 నెలల నుంచి కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదన్నారు. మరణించిన కార్మికులకు రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంతో మరణించిన కార్మికులకు ఏడు లక్షలు, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. పెండింగ్ లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ సమస్య పరిష్కరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం, జీఓ నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు, డైలీ వేజ్ కార్మికులకు రూ.26వేల జీతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రఘునాథ్, మున్సిపల్ కార్మికులు కృష్ణప్ప, రమణ, పార్వతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులు 50 మంది సీఐటీయూలో చేరారు.

నూతన కమిటీ ఎన్నిక

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) నూతన మదనపల్లి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా కే.చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాంబశివ నాయక్, ఉపాధ్యక్షులుగా రాజు, గోపాల్, నరసింహులు, చిన్న రెడ్డెప్ప, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా శ్రీరాములు, మునుస్వామినాయక్, చంద్ర, కోశాధికారి గా పి.రామకృష్ణ తోపాటు మరో 8 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి మన్ననలు పొందాలని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి లుసూచించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కింగ్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కొలిమి హరూన్‌బాషాలతో కలసి శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రుచి, శుచిలు అందిస్తూ వినియోగదారుల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.

బీటీ కళాశాల పూర్వవైభవానికి కృషి



అనిబిసెంట్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వవిద్యార్థుల ట్రస్ట్ అసోసియేషన్ సభ్యులు

- పూర్వవిద్యార్థుల ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- అల్యూమ్ని ట్రస్ట్ ప్రెసిడెంట్ మలిగి మధుసూధనరెడ్డి

మదనపల్లె : పట్టణంలో చారిత్రక నేపథ్యం కలిగి, ఎందరికో ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించి ఉన్నత స్థానాలకు చేరేందుకు కారణమైన బిసెంట్ థియోసఫికల్(బీటీ) కాలేజీ పూర్వవైభవానికి కృషి చేస్తామని పూర్వవిద్యార్థుల సంఘం నూతన అధ్యక్షులు మలిగి మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ కృష్ణ కల్యాణమండపంలో బీటీ కాలేజ్ అల్యూమ్ని ట్రస్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత అనిబిసెంట్ సర్కిల్‌లో బీటీ కళాశాల వ్యవస్థాపకురాలు అనిబిసెంట్ విగ్రహానికి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మలిగి మధుసూధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా మార్పూరి సుధాకర్, సెక్రటరీగా రెడ్డిసుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా వేణుగోపాల్, ట్రెజరర్‌గా నారాయణ, జాయింట్ ట్రెజరర్‌గా భాస్కరాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మలిగి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ... బీటీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవాకార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. బీటీ కళాశాల అభ్యున్నతికి, పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యతాయుతంగా, పారదర్శకంగా సేవలు అందిస్తుందన్నారు. ప్రతి రెండునెలలకు ఒకసారి పూర్వవిద్యార్థుల ట్రస్ట్ అసోసియేషన్ సభ్యులు సమావేశమై, మెడికల్ క్యాంపుల నిర్వహణతో పాటు ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులకు ఆర్థికసహాయం, పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, స్పోర్ట్‌కిట్స్ అందించడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీటికి పట్టణంలోని రోటరీ, లయన్స్, సాయిబాబా ట్రస్ట్, ఇండియన్ యూనియన్ క్లబ్ సభ్యుల సహకారం తీసుకుంటామన్నారు. బీటీ కళాశాల ఆధ్వర్యంలో 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న త్రిలోకికర్ హాకీ గోల్డ్‌కప్ టోర్నమెంట్‌ను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మాజీ కౌన్సిలర్ మధుసూధన్‌రెడ్డి, గంగారపురామదాస్‌చౌదరి, మార్పూరిశశిధర్‌నాయుడు, బోర్‌వెల్ సుధాకర్, రాజ్‌భవన్‌రాజా, వేణు, ఎం.ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కంచర్లశ్రీనివాసులునాయుడు, గంగారపు గౌతమ్, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, సాయిశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగార్జునబాబు, ఆడిటర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక కనుమ పండుగ

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



గౌనివారిపల్లె కనుమ సంబరాలలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక కనుమ పండుగ అని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ గౌనివారి పల్లెలో జరిగిన కనుమ పండుగ సంబరాలలో సర్పంచ్ చెంగ్రాయుడుతో కలసి ఆయన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో పశువుల పండుగ (పశు పూజ) గ్రామీణ ప్రజల ఐక్యత పెంపొందిస్తుందన్నారు. తెలుగువారి పండుగలలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు విశిష్టమైన స్థానం వుందన్నారు. కనుమ సందర్భంగా గ్రామ గ్రామాన పశువుల పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అనంతరం స్థానిక కార్యకర్తలతో సమావేశం అయ్యారు. రాబోయే రోజుల్లో మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రమేష్ రెడ్డి, కొండగాళ్ల రమణ, రాజగోపాల్ కొత్తపల్లి మహేష్ , గంగాధర్, మల్లికార్జున రెడ్డి, సిటిజన్ బాష, మల్లికార్జున, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిరక్షణ కోసం సామూహిక దీక్షలు



ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిని ప్రైవేట్‌పరం కాకుండా పరిరక్షణ కోసం జరుగుతున్న సామూహిక దీక్షలు జయప్రదం చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లి సర్వజన బోధన ఆసుపత్రి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని నిర్వహిస్తున్న సామూహిక దీక్షలకు సంబంధించి ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్సలు అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. పీలేరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గ ప్రజలతో పాటు కర్ణాటక ప్రాంత ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి వైద్యం చేయించుకుంటారన్నారు. మదనపల్లి ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ప్రభుత్వ ఆసుపత్రిని గత ప్రభుత్వం జిల్లా ఆసుపత్రిగా, తర్వాత రోజుల్లో సర్వజన బోధనాసుపత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలందరూ హర్షించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, ఇక్కడున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బోధన ఆస్పత్రిని కాపాడుకోవడానికి ప్రజలు అందరూ ఐక్యంగా పోరాటం చెయ్యాలని, సీపీఎం చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సామూహిక దీక్షలను జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు ప్రభాకర్, మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో పేదలను వివిధ రకాల పరీక్షల పేరుతో దోచుకుంటున్నారన్నారని, పేదలకు అండగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కూడా ప్రైవేటుపరమైతే ఇక సామాన్యుడు వైద్యం చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సర్వజన బోధన ఆసుపత్రి గానే ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం జరుగుతున్న ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రఘునాథ్, వెంకటరమణ నాయుడు, నారాయణ, నావాజ్, రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.